

నల్లగొండ జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగులు

# పోలీస్ జాబ్ మేళాకు విశేష స్పందన

- హాజరైన 6,497 మంది అభ్యర్థులు
- 3,033 మందికి ఉద్యోగ కల్పన, మరో 300 మందికి పార్ట్ టైమ్ జాబ్‌లు
- ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి

నీలగిరి, ఏప్రిల్ 5 : జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో యువతేజం పేరుతో శనివారం పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. మొత్తం 132 కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొనగా జిల్లా వ్యాప్తంగా సుమారు 6,497వేల మంది నిరుద్యోగులు హాజరయ్యారు. ఇందులో 3,033 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందారు. మరో 300 మందిని పార్ట్ టైమ్ పద్ధతిలో ఎంపిక చేశారు. నల్లగొండ పట్టణానికి చెందిన విజయశ్రీ రూ.45వేల జీతం, నల్లగొండ మండలం వెలుగుపల్లికి చెందిన కందులకూరి సోనికి రూ.40వేల అత్యధిక వేతనంతో ఉద్యోగాలు పొందారు. సుమారు రూ.15వేల నుంచి రూ.45వేల వరకు వేతనాలు కలిగిన ఉద్యోగాలు జాబ్‌మేళా ద్వారా పొందారు. జాబ్‌మేళాను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ జాబ్‌మేళాలో తక్కువ వేతనం వచ్చిన వారు నిరాశ పడొద్దన్నారు. తాను కూడా మొదటిసారిగా రూ.18వేల జీతానికి బొంబాయిలో ఇంటర్న్‌షిప్ చేశానని గుర్తు చేశారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ జాబ్‌మేళాకు 132 కంపెనీలు వచ్చాయని పేర్కొన్నారు. ఏఎస్పీ మౌనిక, జాబ్ కోఆర్డినేటర్ రవి, డీఎస్పీ శివరాంరెడ్డి ఉన్నారు. అదే విధంగా నల్లగొండ జిల్లా జనరల్ అసుపత్రిలో రూ.23 కోట్లతో నిర్మాణం చేసిన క్రిటికల్ కేర్‌ను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభించారు.

**జాబ్ మేళాకు తరలిన యువత**

త్రిపురారం : నల్లగొండ జిల్లా కేంద్రంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాకు త్రిపురారం మండల కేంద్రం నుంచి వివిధ గ్రామాలకు చెందిన యువత స్థానిక ఎస్ఐ వై.ప్రసాద్, ప్రత్యేక వాహనంలో తీసుకెళ్లారు.

## క్వింటా ధాన్యాన్ని రూ.2300కు కొనాలి

- సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్

మిర్యాలగూడ, ఏప్రిల్ 5 : ప్రభుత్వం ప్రకటించిన విధంగా రైతులు పండించిన ధాన్యం క్వింటాకు మిల్లర్లు రూ.2300 చెల్లించాల్సిందేనని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ అన్నారు. శనివారం ఆయన కార్యాలయంలో రైస్ మిల్లర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ మిల్లర్లు అన్ని రకాల ధాన్యంతో పాటు హెచ్‌ఎంటీని తప్పనిసరిగా కొనుగోలు చేయాలన్నారు. వెయింగ్ మిషన్లలో వ్యత్యాసం ఉండకూడదని, మిల్లుల వద్ద ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మిల్లుల కెపాసిటీని మించి ధాన్యం లోడ్లు వస్తున్నందున రైతులకు ఇబ్బంది కలుగకుండా టోకెన్లను తేదీల వారీగా కేటాయించాలన్నారు. ప్రతి రైస్ మిల్లు కస్టమ్ మిల్లింగ్ కోసం ప్రతిరోజు కెపాసిటీలో 50శాతం ధాన్యం తప్పనిసరిగా కొనుగోలు చేయాలన్నారు. రైతులకు త్వరితగతిన డబ్బులు చెల్లించాలని, వేసవి దృష్ట్యా తాగునీటి సౌకర్యం, నీడను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో తాసీల్దార్లు హరిబాబు, సురేశ్, జవహర్‌లాల్, సివిల్ సప్లయ్ డీటీ జావిద్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేశ్, మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు గంటా సంతోశ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకట రమణా చౌదరి, కుశలయ్య, గుడిపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

**సబ్ కలెక్టర్‌కు సన్మానం**

యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో భూనిర్వాసితులైన 112 మంది ఉద్యోగ నియామకపత్రాలు అందుకున్న సందర్భంగా శనివారం సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌ను ఆయన కార్యాలయంలో ఉద్యోగులు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సబ్ కలెక్టర్ చొరవతో త్వరగా ఉద్యోగాలు వచ్చాయని వారు పేర్కొన్నారు.

## రాములోరి కల్యాణానికి సర్వం సిద్ధం



నల్లగొండ రామాలయంలో స్వామివారి ఎదుర్కోలు నిర్వహిస్తున్న అర్చకులు

రామగిరి, ఏప్రిల్ 5 : నేడు శ్రీరామనవమి సందర్భంగా జిల్లాలోని సీతారామచంద్రస్వామి, ఆంజనేయస్వామి ఆలయాలతో పాటు పలు ఆలయాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో రెండో భద్రాద్రిగా పేరు గాంచిన రామగిరిలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో శనివారం రాత్రి స్వామి, అమ్మవార్ల ఎదుర్కోలు మహోత్సవం వైభవంగా నిర్వహించారు.

## రేషన్ కార్డులే లేవు.. సన్న బియ్యం ఎట్లిస్తరు : బీఆర్ఎస్

కొండమల్లేపల్లి, ఏప్రిల్ 5 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా ఒక్క రేషన్‌కార్డు కూడా ఇయ్యలేదని, ఇక సన్న బియ్యం ఎలా పంపిణీ చేస్తారని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమావత్ దస్రూనాయక్ శనివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. రేషన్ కార్డులు ఇవ్వకుండా సన్నబియ్యం పంపిణీ చేయడంతో చాలా మంది పేదలకు బియ్యం దక్కట్లేదని చెప్పారు. పథకాలు ఇస్తామని దరఖాస్తులు స్వీకరించి వాటిని బుట్టదాఖలు చేశారని విమర్శించారు. మార్చి 31 లోపు రైతు భరోసా 100 శాతం పూర్తి చేస్తామని ఇచ్చిన హామీ.. మాటలకే పరిమితమైందని చెప్పారు. కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు.

# పెట్రోల్ తక్కువ వస్తుందని బంక్‌లో నిరసన



పెట్రోల్ తక్కువ వచ్చిందని చూపుతున్న శ్రీనివాస్‌రెడ్డి

పెద్దవూర, ఏప్రిల్ 5 : మండల కేంద్రంలోని శివాజీ ఫిల్లింగ్ స్టేషన్‌లో లీటర్ పెట్రోల్‌కు 150 పాయింట్లు తక్కువగా వస్తుందని ఆరోపిస్తూ వినియోగదారులు శనివారం బంక్ ఎదుట ఆందోళన చేశారు. తుంగతుర్తి గ్రామానికి చెందిన దారెడ్డి శ్రీనివాస్ రెడ్డి పెట్రోల్ బంక్‌కు వచ్చి రూ.220 పెట్రోల్‌ను బాటిల్‌లో పోయించుకున్నాడు. పెట్రోల్ కొలతలో తేడా వచ్చిందని గమనించి సిబ్బందిని ప్రశ్నించాడు. వెంటనే అక్కడికి వచ్చిన మరో వ్యక్తి దగ్గర ఉన్న బాటిల్‌ను తీసుకొని మళ్లీ రూ.220 పెట్రోల్‌ను పోయిస్తే కరెక్టుగానే వచ్చింది. రెండు బాటిళ్లలోని పెట్రోల్‌ను సరిచూడగా తేడా వచ్చింది. వెంటనే పెట్రోల్ పోసిన వ్యక్తితో రెండు బాటిళ్లను తూకం వేయించగా ఒక దాంట్లో 140 పాయింట్లు తక్కువ ఉంది. దీంతో బాధితుడు పెట్రోల్ బంక్ సిబ్బందిని ప్రశ్నించగా వేసవిలో అలాగే వస్తుందని, తాము ఏం చేయలేమని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తాను ప్రశ్నించడంతో వేరే బాటిల్‌లో కరెక్టుగా పెట్రోల్ పోశారని, అడుగకపోతే వినియోగదారులను మోసం చేస్తున్నట్లే కదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పటికే పెట్రోల్, డీజిల్ పోయించుకోవడానికి వచ్చిన వినియోగదారులు విషయం తెలుసుకొని ఆందోళనకు దిగారు. బాటిల్‌లో పెట్రోల్ పోయడంతో విషయం తెలిసిందని, నేరుగా వాహనాల ట్యాంకుల్లో పోస్తుండడంతో ఎంత తక్కువ వస్తుందోనని నిరసన చేపట్టారు. బంక్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ వీరబాబు పెట్రోల్ బంక్ వద్దకు వచ్చి నిర్వాహకుడు, బాధితుడితో మాట్లాడారు. సంబంధిత తూనికల కొలతల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి బాటిల్‌లోని పెట్రోల్‌ను దగ్గరుండి కొలిపించారు. రూ.220కి 2.04 లీటర్లు రావాల్సి ఉండగా 1.770 మిల్లీ లీటర్ల పెట్రోల్ మాత్రమే వచ్చింది. 230 మిల్లీ లీటర్ల పెట్రోల్ తక్కువ వచ్చింది. మరో బాటిల్‌లో పెట్రోల్ సరిగానే ఉంది. దీంతో ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు తెలియపరిచారు. తేడాలు రావడానికి గల కారణాలను సంబంధిత అధికారులు తనిఖీ చేపడుతామని చెప్పడంతో ఆందోళన విరమింపజేశారు.



నల్లగొండ : మర్రిగూడ బైపాస్‌లో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పక్కన కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్ర పవార్



మిర్యాలగూడలో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్



నకిరేకల్ : జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

# యువత బాబు జగ్జీవన్ రామ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఘన నివాళి



దేవరకొండలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బాలూనాయక్

నీలగిరి/రామగిరి, ఏప్రిల్ 5 : యువత డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్‌ను అదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని మర్రిగూడ బైపాస్ వద్ద గల మహనీయుల విగ్రహాలకు, ఎన్జీ కళాశాల ఎదురుగా ఉన్న బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి 118 జయంతి సందర్భంగా పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ అంటరాని వారికి తన జీవితాన్ని అంకితం చేసినట్లు గుర్తు చేశారు. నల్లగొండ జిల్లా అభివృద్ధిలో భాగంగా 7న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ ఎలాంటి వసతులు లేని బీహార్‌లోని అత్యంత వెనుకబడిన ఆరా ప్రాంతం నుంచి వచ్చిన జగ్జీవన్ రామ్ అంచెలంచెలుగా ఎదిగి ఉప ప్రధాని అయ్యారన్నారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ గొప్ప సంఘ సంస్కర్త, స్వాతంత్ర్య పోరాట యోధుడన్నారు. కార్యక్రమంలో ఏసీ శ్రీనివాస్, రిటైర్డ్ ఐఏఎస్ చోల్లేటి ప్రభాకర్, చక్రహరి రామరాజు ఉన్నారు.

నల్లగొండ రూరల్ : జగ్జీవన్ రామ్‌కు నల్లగొండ ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ వెంకట్‌రెడ్డి నివాళులర్పించారు. పంచాయతీ కార్యదర్శి ఫారుక్, సిబ్బంది హరికృష్ణ, జ్యోతి ఉన్నారు.

బాబు జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

నల్లగొండ సిటీ : కనగల్ మండల కేంద్రంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి తుర్కపల్లి మాజీ సర్పంచ్ ఆదిమళ్ల లింగయ్య నివాళులర్పించారు. దళిత ఐక్యవేదిక మండలాధ్యక్షుడు మేకల నర్సింహ, కందుల మారయ్య, ఎర్రోళ్ల శ్రీనివాస్, మల్లేపల్లి నర్సింహ, నాగరాజు, వెంకన్న ఉన్నారు.

తిప్పర్తి : తాసీల్దార్ పరుశురామ్ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు.

గొప్ప దార్శనికుడు బాబు జగ్జీవన్‌రామ్

నకిరేకల్/కట్టంగూర్ : నకిరేకల్ పట్టణంలోని సాయిబాబా గుడి వద్దనున్న జగ్జీవన్ రామ్ విగ్రహానికి ఎమ్మెల్యే వేముల వీరేశం నివాళులర్పించారు. కార్యక్రమంలో శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్, మున్సిపల్ చైర్మన్ చౌగోని రజితశ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ గుత్తా మంజుల మాధవరెడ్డి ఉన్నారు. కట్టంగూర్ : కట్టంగూర్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ పెరుమాళ్ల జ్ఞానప్రకాశ్‌రావు, ఇన్‌చార్జి ఎంపీఓ చింతమల్ల చలపతి, ఆర్ఐ కుమార్‌రెడ్డి, ఏపీఓ కడెం రాంమోహన్, సిబ్బంది రాఘవేంద్ర నివాళులరపించారు.

నార్కట్‌పల్లి / చిట్యాల : నార్కట్‌పల్లి బస్ డిపో వద్ద జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో చిరుమర్తి యాదయ్య, చింతపల్లి బయ్యన్న, కొత్త నర్సింహ, ఆదిమల్ల యాదగిరి, నర్సింహ, లింగాల యాదయ్య ఉన్నారు.చిట్యాల మండలంలో జగ్జీవన్ రామ్‌కు వివిధ పార్టీలకు చెందిన నాయకులు నివాళులర్పించారు. నాయకులు కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, పోకల దేవదాసు, జడల చినమల్లయ్య, వనమా వెంకటేశ్వర్లు, ఎద్దులపురి కృష్ణ, మాస శ్రీనివాస్, గుండాల నరేశ్, పల్లె వెంకన్న, ఉరుమడ్లలో కోనేటి యాదగిరి, పోలగోని స్వామి పాల్గొన్నారు.

కేతేపల్లి /నిడమనూరు /హాలియా: కేతేపల్లి మండల పరిధిలోని బండపాలెం గ్రామంలో జగ్జీవన్ రామ్ విగ్రహానికి ఎమ్మార్పీఎస్ నాయకుడు వంగూరి ప్రసాద్ నివాళులుర్పించారు. నాయకులు వంగూరి రాము, పి.శ్రీనివాస్‌రావు, ఎన్.వెంకటరత్నం, వి.అనిల్, వి.అశోక్, ఎన్.సందీప్, వి.వెంకటేశ్ పాల్గొన్నారు. నిడమనూరులో దళిత సంఘాల ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఆదిమల్ల ఎల్లయ్య, కొండేటి శ్రీను, వింజమూరు ప్రభాకర్, బొజ్జ పుల్లయ్య, ప్రజా సంఘాల నాయకులు తదితరులున్నారు. హాలియా మున్సిపల్ కార్యాలయం సమీపంలో గల జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎస్ఐ సతీశ్‌రెడ్డి నివాళులర్పించారు. అదే విధంగా రాజకీయ నాయకులు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నివాళులర్పించగా మందా సైదులు రావు గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దవూర /త్రిపురారం : పెద్దవూర మండల కేంద్రంలోని ఎంపీడీఓ, తాసీల్దార్ కార్యాలయాల్లో నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ దండ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఆడెపు నాగార్జున, నాయకులు వీరబోయిన వెంకటయ్య, హైదలి, ఆడెపు రామలింగయ్య, బొంగరాల వెంకటేశ్వర్లు, దుబ్బ రవి పాల్గొన్నారు. త్రిపురారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ, తాసీల్దార్ కార్యాలయాల్లో జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పించగా సూపరింటెండెంట్ దయాకర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ భరద్వాజ్, ఆర్ఐ సైదులు, కోడిరెక్క రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

చండూరు : చండూరు మండల కేంద్రంలో ఐక్య వేదిక ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి దళిత జాతి రాష్ట్ర నాయకుడు, మాజీ కౌన్సిలర్ అన్నెపర్తి శేఖర్ నివాళులర్పించారు. కార్యక్రమంలో మాదిగ జేఏసీ రాష్ట్ర నాయకులు కురుపాటి సుదర్శన్, ఇరిగి ఆంజనేయులు, ఇరిగి దుర్గాప్రసాద్, ఇరిగి లక్ష్మయ్య, ఆకారపు ఏసు, ఇరిగి శంకర్, అన్నేపర్తి వెంకటేశం, ఇరిగి చరణ్, తలారి సురేశ్ పాల్గొన్నారు.

మర్రిగూడ : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ జీసీ మునయ్య, సూపరింటెండెంట్ యూకూబ్, అధికారులు నివాళులర్పించారు.

మిర్యాలగూడ : పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నూకల వేణుగోపాల్‌రెడ్డి, గాయం ఉపేందర్‌రెడ్డి, తలకొప్పుల సైదులు, బెజ్జం సాయి, దేశిడి శేఖర్ రెడ్డి ఉన్నారు.

చందంపేట(దేవరకొండ) : దేవరకొండలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ నివాళులర్పించారు. అదే విధంగా బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పించగా చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్, చంద్రమౌళి, శ్రీను, వెంకటేశ్వర్లు, వీరయ్య, శారద, శ్రీనివాసులు తదితరులున్నారు.



ఎంజీయూలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రొఫెసర్ అల్వాల రవి



మిర్యాలగూడ రూరల్ : జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తాసీల్దార్ హరిబాబు



కేతేపల్లి : బండపాలెంలో బాబుజగ్జీవన్‌రావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

## మహనీయుడి జయంతి రోజున దళిత మంత్రికి అవమానం


నల్లగొండ జిల్లా కేంద్ర దవాఖానలో ఘటన | ఆరోగ్య శాఖ మంత్రి ఫొటో, పేరు లేకుండా క్రిటికల్ కేర్ యూనిట్ ప్రారంభోత్సవం ఫ్లెక్సీ ఏర్పాటు




ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఫొటో, పేరు లేకుండానే క్రిటికల్ కేర్ యూనిట్ ప్రారంభోత్సవ స్టేజీపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

నీలగిరి, ఏప్రిల్ 5 : మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి రోజున నల్లగొండ జిల్లా కేంద్ర దవాఖాణ అధికారులు మాత్రం రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి, మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహకు అవమానం కలిగేలా వ్యవహరించారు. జిల్లా జనరల్ ఆస్పత్రిలో రూ.23 కోట్లతో నిర్మించిన క్రిటికల్ కేర్ యూనిట్ ప్రారంభోత్సవం సందర్భంగా ప్రొటోకాల్ ప్రకారం ఫ్లెక్సీలో అందరి ఫొటోలు, పేర్లు వేయాల్సి ఉంది. కానీ స్టేజీపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ఆరోగ్య శాఖ మంత్రి దామోదార రాజానర్సింహ ఫొటో, పేరు లేకుండానే ఇతర శాఖల మంత్రుల ఫొటోలు, పేర్లు పెట్టారు. ప్రారంభోత్సవానికి పది నిమిషాల్లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అక్కడకు రావాల్సి ఉండగా.. ఈలోగా ఆరోగ్య శాఖ మంత్రి ఫొటో, పేరు ఫ్లెక్సీలో పెట్టకుండా దళిత మంత్రిని అవమానించారని సోషల్ మీడియాలో ఫొటోలు చక్కర్లు కొట్టాయి. ఈ విషయం మంత్రి కోమటిరెడ్డి దృష్టికి రావడంతో వైద్యాధికారులపై ఆయన సీరియస్ అయ్యారు. కార్యక్రమానికి కూడా రాలేదు. కలెక్టర్ ఇలా త్రిపాఠి వైద్యాధికారులను మందలించి మరో ఫ్లెక్సీ ఏర్పాటు చేయించారు. సుమారు గంటన్నర తరువాత మంత్రిని ఆహ్వానించగా, అప్పుడు వచ్చిన మంత్రి కోమటిరెడ్డి క్రిటికల్ కేర్ యూనిట్‌ను ప్రారంభించి స్టేజీ ఎక్కకుండానే గేటు వద్ద మీడియాతో మట్లాడి వెళ్లిపోయారు.

## నిత్యారెడ్డికి గణిత ఎక్సలెన్స్ అవార్డు




నిత్యారెడ్డికి అవార్డు అందిస్తున్న ఎస్‌సీఈఆర్‌టీ మంగారెడ్డి

నల్లగొండ విద్యావిభాగం (రామగిరి), ఏప్రిల్ 5 : నల్లగొండ పట్టణానికి చెందిన మూడో తరగతి విద్యార్థిని పబ్బత్‌రెడ్డి నిత్యారెడ్డి రాష్ట్ర స్థాయి గణిత ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారు. స్వమేధ ఎడ్యుకేషన్ సర్వీసెస్ ఆధ్వర్యంలో మేకిన్ ఇండియాలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గణిత అంశాలపై పరీక్ష నిర్వహించారు. నల్లగొండలోని అరబిందో పబ్లిక్ స్కూల్‌లో మూడో తరగతి చదువుతున్న నిత్యారెడ్డి ఈ పరీక్షల్లో ప్రతిభ కనబర్చి ప్రథమ బహుమతి పొందారు. జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకొని హైదరాబాద్‌లో శనివారం నిత్యారెడ్డికి రూ.2500 నగదు బహుమతి, ప్రశ్నాపత్రం, మెమొంటోను తెలంగాణ రాష్ట్ర విద్యా శిక్షణ పరిశోధన సంస్థ ప్రొఫెసర్ మంగారెడ్డి అందించారు. ఈ సందర్భంగా నిత్యారెడ్డిని అరబిందో స్కూల్ ప్రిన్సిపాల్ మర్రెడ్డి రమణ, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో స్వమేధ ఎడ్యుకేషన్ సర్వీసెస్ వ్యవస్థాపకుడు రవికుమార్ నడింపల్లి, పబ్బత్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, స్వాతి పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

హాలియా, ఏప్రిల్ 5 : అనుముల మండలం ఇబ్రహీంపేట, మారేపల్లి గ్రామాల్లో కొత్తపల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం నల్లగొండ జిల్లా సహకార అధికారి పాత్యానాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు 1010 రకం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో సహకార సంఘ కార్యదర్శి రావుల సత్యం, యడవల్లి నరేందర్‌రెడ్డి, కుందూరు వెంకట్‌రెడ్డి, గౌని రాజారమేశ్, వెంకటయ్య పాల్గొన్నారు.

## మండలంలో 7 ఐకేపీ కొనుగోలు కేంద్రాలు

శాలిగౌరారం, ఏప్రిల్ 5 : మండలంలో 7 ఐకేపీ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీఎం రాములు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్జీ కొత్తపెల్లి, ఆకారం, గురజాల, చిత్తలూర్, బైరవునిబండ, రామాంజపురం, తుడిమిడి గ్రామాల్లో త్వరలో ఐకేపీ అధ్వర్యంలో ధాన్యం కొనుగోలు ప్రారంభించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## నిత్యావసర వస్తువుల పంపిణీ

చిట్యాల, ఏప్రిల్ 5 : పట్టణ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యక్షుడు పాటి మాధవరెడ్డి సహకారంతో ఆయన కుమారుడు వరుణ్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా శనివారం రోడ్డు ప్రమాదానికి గురైన చిట్యాలకు చెందిన రామదాసుకు 25కిలోల బియ్యం, రూ.1000 నగదును అందించారు. నార్కట్‌పల్లి ఆదరణ వృద్ధాశ్రమంలో 25కిలోల బియ్యం, పండ్లు పంపిణీ చేశారు.

## తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలి : ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

గట్టుప్పల్/మునుగోడు, ఏప్రిల్ 5 : వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అధికారులను సూచించారు. మునుగోడు నియోజకవర్గంలో తాగునీటి సమస్యపై నల్లగొండ, యాదాద్రి జిల్లాలకు చెందిన మిషన్ భగీరథ అధికారులు, అన్ని మండలాల నాయకులతో శనివారం మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గానికి మిషన్ భగీరథ నీరు అందించే వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ లింగోటం, ఉదయ సముద్రం నుంచి ప్రతిరోజు ఎన్ని లీటర్ల నీరు సరఫరా అవుతుంది తదితర విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు జగ్జీవన్ రామ్‌కు నివాళులర్పించారు. సమావేశంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, మిషన్ భగీరథ జిల్లా ఎస్ఈ నాగేశ్వర్‌రావు, యాదాద్రి జిల్లా ఎస్ఈ కృష్ణయ్య, ఈఈలు, డీఈలు, ఏఈలు, వివిధ మండలాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## రైతులను మోసగిస్తున్న వ్యాపారులపై పీడీ యాక్ట్ పెట్టాలి : అశోక్



తిరుమలగిరి అశోక్

మిర్యాలగూడ, ఏప్రిల్ 5 : ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవాలంటే రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ అన్నారు. శనివారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర రాక తీవ్ర ఆందోళన చెందుతున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రైస్ మిల్లర్లు సిండికేట్‌గా మారి రైతులను దోచుకుంటున్నారని, అలాంటి వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు అందాల్సిన మద్దతు ధర రాకపోవడంతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో రూ.2800 పలికిన ధర, నేడు రూ.2200 కూడా పలుకడం లేదన్నారు. త్వరలోనే రైతులందరితో కలిసి పెద్ద ఎత్తున ప్రజాప్రతినిధుల కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు.


## డ్రగ్స్ వినియోగంపై ఉపాధ్యాయుడి వినూత్న ప్రచారం



సంతలో కరపత్రం అందిస్తున్న ప్రభాకర్

కట్టంగూర్, ఏప్రిల్ 5 : డ్రగ్స్‌కు యువత బానిసై తమ భవిష్యత్ నాశనం చేసుకోవద్దని సూర్యాపేట జిల్లా గోరుంట్ల ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ శనివారం కట్టంగూర్ వార సంతలో వినూత్న ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా మైక్ ద్వారా ప్రచారం చేస్తూ కరపత్రాలను పంచుతూ నో డ్రగ్స్-సేవ్ లైఫ్ అనే నినాదంతో అవగాహన కల్పించి మాట్లాడారు. యువత మద్యం, డ్రగ్స్ బారిన పడి పెడదారి పడుతారన్నారు. ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూనే సెలవు రోజుల్లో వార సంతల్లో డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తునట్లు పేర్కొన్నారు.

## భూ సమస్యలు పరిష్కరించాలి : ఆనంద్



మాట్లాడుతున్న కంబాలపల్లి ఆనంద్

చందంపేట , ఏప్రిల్ 4 : రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను అధికారులు పరిష్కరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటి సభ్యుడు కంబాలపల్లి ఆనంద్ అన్నారు. మండలంలోని నల్లచెలమూల గ్రామంలో శనివారం ఆయన రైతులతో మాట్లాడి భూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో సర్వే నంబర్ 206ను నిషేధిత జాబితా నుంచి తొలగించి వాస్తవ రైతులకు రైతు భరోసా, రుణమాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. నల్లచెలమూల గ్రామంలో గత కొన్నేళ్లుగా రైతులు భూ సమస్యలు ఉన్నప్పటికీ పరిష్కారం రావడం లేదని, సంబంధిత అధికారులు చొరవ తీసుకొని పరిష్కరించాలని కోరారు. ఆయన వెంట పాపయ్య, ఆంజనేయులు, బొంగు వెంకటయ్య, కుక్కల పుల్లయ్య, ఆంజనేయులు, చెన్నయ్య, శ్రీనయ్య తదితరులున్నారు.

## పేదలకు వరం సన్న బియ్యం : మంత్రి కోమటిరెడ్డి

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 5 : సన్న బియ్యం పేదలకు వరం అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఎల్లారెడ్డిగూడెంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి లబ్ధదారురాలు మేడి అరుణ ఇంట్లో శనివారం సన్న బియ్యంతో వండిన భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ త్వరలోనే రాజీవ్ యువశక్తి పథకం కింద నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ యువతకు స్వయం ఉపాధి కింద రూ. 4లక్షల ఆర్థికసాయం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆయనవెంట అదనపు కలెక్టర్ జె శ్రీనివాస్, ఆర్డీఓ వై అశోక్ రెడ్డి, తాసీల్దార్ వెంకటేశ్వర్‌రావు ఉన్నారు.

## ప్రభుత్వ విద్య కనుమరుగయ్యే ప్రమాదం : మాజీ ఎమ్మెల్సీ

రామగిరి, ఏప్రిల్ 5 : ప్రభుత్వ విద్య కనుమరుగయ్యే ప్రమాదం పొంచి ఉందని మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. నల్లగొండలోని యూటీఎఫ్ భవన్‌లో శనివారం నిర్వహించిన సంఘం జిల్లా కమిటీ సమావేశం, రాష్ట్ర 6వ మహాసభల అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గుతుందని, బలోపేతానికి అందరు సమష్టిగా కృషి చేయాలని కోరారు. అనంతరం జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రూప్-1 ఫలితాల్లో సత్తాచాటిన అభ్యర్థులను సన్మానించారు. జిల్లా అధ్యక్షుడు బక్కా శ్రీనివాసాచారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్, జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం, నలపరాజు వెంకన్న, వేదశ్రీ, చింతమల్ల వరలక్ష్మి పాల్గొన్నారు.

## బుడమర్లపల్లి పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

నల్లగొండ సిటీ, ఏప్రిల్ 5 : గ్రామపంచాయతీ బిల్లుల విషయంలో అవకతవకలకు పాల్పడినందుకు గాను కనగల్ మండలం బుడమర్లపల్లి పంచాయతీ కార్యదర్శి ఖాసీంను సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గత ప్రభుత్వ పాలనలో చేసిన అభివృద్ధి పనులకు గానూ రావాల్సిన బిల్లుల విషయంలో అధికారులు, గ్రామ సెక్రటరీ బిల్లులు రాకుండా తనను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మాజీ సర్పంచ్ కారింగు పార్వతమ్మజానయ్యగౌడ్ ఇటీవల కలెక్టర్ ఇలా త్రిపాఠికి ఫిర్యాదు చేశారు. ఈ విషయమై కలెక్టర్ జిల్లా స్థాయి ఉన్నతాధికారులను విచారణకు ఆదేశించి, అనంతరం సెక్రటరీ ఖాసీంను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై ఎంపీడీఓను వివరణ కోరగా సస్పెండ్ అయిన విషయం నిజమేనని తెలిపారు.

## రైతులకు అన్నదానం

మిర్యాలగూడ, ఏప్రిల్ 5 : మండల సమీపంలోని సూర్యతేజ రా అండ్ పారాబాయిల్డ్ రైస్ ఇండస్ట్రీస్‌కు ధాన్యం తీసుకొచ్చిన రైతులకు యాజమాన్యం శనివారం అన్నదానం చేసింది. ఈ సందర్భంగా రైస్ మిల్లు యజమాని జయిని మురళి మాట్లాడుతూ తమ మిల్లుకు ధాన్యం తీసుకొచ్చిన రైతులకు 15రోజులుగా అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పైడిమర్రి రంగనాథ్, పైడిమర్రి సురేశ్, జయిని ప్రకాశ్, సతీశ్, శ్రీరాంరెడ్డి, విజయ్‌రెడ్డి పాల్గొన్నారు.